# అగ్ని పరీక్ష

**విశ్వనాథ పావనిశాస్త్రి**

బ్రహ్మాస్త్రంతో రావణాసురుణ్ణి సంహరించాడు శ్రీరామచంద్ర మూర్తి.

సోదరుడైన రావణునికి అపర కర్మలు దివ్యంగా జరిపాడు విభీషణుడు.

అంతకాలం సీత అశోకవనంలో, శింశుపా వృక్షం కిందనే వుంది. రాముడు సముద్రపుటొడ్డున గుడారంలోనే వున్నాడు.

రాముడు రావణ, కుంభకర్ణులను చంపాడు. యుద్ధం చాలా శ్రమైపోయింది" అని రాముడు చెప్పమన్న వార్తని సీతతో చెప్పాడు హనుమంతుడు.

"నాకు రాముణ్ణి చూడాలని వుంది" అని కబురంపింది సీత.

"అయితే పన్నీట స్నానం చేసి సర్వాలంకార భూషితవై రా" అని విభీషణుని చేత తిరిగి కబురంపించాడు రాముడు. ఆవిడ, "ఎలా వున్నదానిని అలాగే వస్తాను" అని అంది. విభీషణుడు, "అమ్మా! స్వామికి కోపం వస్తుంది. ఆయన చెప్పినట్లే చెయ్ తల్లీ" అన్నాడు. ఆవిడ కాస్సేపాలోచించి- 'సరే' అంది.

ఈ వ్యవహారమంతా గమనిస్తున్న వానర, రాక్షస, భల్లూక వీరులందరూ ఆశ్చర్యపోయారు- "ఈ మహాను భావుడు హాహా!' అంటూ యిన్నాళ్లూ దుఃఖించింది సీత కోసం. అసాధ్యులైన ఇంతమంది వానరుల్ని సమీకరించింది ఈ సీత కోసం. మహా బలవంతులైన అనేక మంది రాక్షసుల్ని సంహరించింది ఈ సీత కోసం. రావణుణ్ణి సంహరించి 'హా సీతా!' అంటూ ఆవిణ్ణి అక్కున చేర్చుకోవలసింది పోయి, ఈ రాయబారా లేమిటి, ఈ గోల ఏమిటి?- అనుకుని విస్తుపోయారు.

అంతలో పల్లకిలో సీతామహాదేవి వచ్చింది. ఆనాడు రాముడి వెంట అరణ్యానికి ఎలా బయలుదేరిందో, అలా సర్వాలంకార భూషితయై వచ్చింది. మాయ లేడిని తెమ్మని కోరినప్పుడు ఎంత అమాయకంగా వుందో, అంత అమాయకురాలుగా వచ్చింది.

ఆ మహాదేవిని చూడడానికి ప్రతి ఒక్కరూ ఒళ్ళంతా కళ్ళు చేసుకుని నిలబడ్డారు. ఇంతలో పల్లకితెర తొలిగింది. సీతాదేవి అగ్ని శిఖలాగా భూమి కవతరించింది.

అటు మహా సైన్యం లాంటి సముద్రం! ఇటు సముద్రం లాటి మహా సైన్యం! అటు బడబాగ్ని లాగా సీతామహాదేవి! ఇటు మంచు కప్పిన మహాగ్ని పర్వతమల్లే శ్రీరామచంద్రుడు!

బడబాగ్నితో సలసల కాగి, ఫెళఫెళ లాడుతున్న సముద్ర ఘోష లాటి తన కంఠం విప్పి రాముడు, 'సీతా!' అన్నాడు. పెను ఝంఝకి పనస చెట్టులాగా కంపించిపోయింది సీతాదేవి.

రాముడి కంఠం వినిపించసాగింది. "బంగారు లేడిని తెమ్మన్నావు. లక్ష్మణుడు చెపుతూనే వున్నాడు. అది లేడి కాదు, మాయ అని. చివరికి అది మాయ మారీచుడయింది. వాడిని చంపాను. నా కులసతిని అపహరించి, తన లంకలో ఏడాది దాచి, మా రఘువంశ ప్రతిష్ఠని మంట కలిపిన రావణుణ్ణి సకులంగా మంటగలిపాను. ఇక నువ్వు స్వతంత్రురాలివి. నా శక్తిలో నీకు గురి లేదు. నా నిర్ణయాలతో నీకు పని లేదు. నా అనుచరులందు నీకు నమ్మకం లేదు. నువ్వు సర్వ సమర్థురాలివి. లక్ష్మణుడు, విభీషణుడు, సుగ్రీవుడు వున్నారు. ఒకడు మానవుడు, ఒకడు దానవుడు, ఒకడు వానరుడు. నీ మనస్సుకి ఎవరు సమర్థులని తోస్తే వారి దగ్గర వుండవచ్చు- నీ యిష్టం-"

సముద్రంతో సహా అంతా నిశ్చలులైపోయారు. దూరంగా నిలబడ్డ త్రిజట ఆశ్చర్యపోయింది. "రావణ స్వామి కన్నా రాక్షసుడల్లే వున్నాడే ఈ రాముడు! ఇన్నాళ్లూ తన కోసం నిద్రాహారాలు మాని, సంతత ధారగా విలపించిన సీతను పట్టుకుని ఎంతెంత మాటలంటున్నాడు! ఇది మగజాతి లక్షణం కాబోలు! అనేక మంది స్త్రీలను చెరబట్టి, భార్యను నిర్లక్ష్యం చేసి, తన అహంకారం ఆ విధంగా ప్రదర్శించాడు రావణుడు! ఏక పత్నీవ్రతుడనని చెప్పుకుంటూ, భార్యను నిందిస్తూ, ఈ విధంగా తన అహంకారం ప్రదర్శిస్తున్నాడు రాముడు! "ఆహా! ఏమి పురుషులు!" అనుకుంది త్రిజట.

పక్కనే వుండి త్రిజట ఆలోచనలను గమనిస్తున్న సింహజట "ఓసి పిచ్చిదానా! ఆడవాళ్లకు మాత్రం లేవా అహంకారాలు? కైక తన అహంకారంతో దశరథుణ్ణి ఎంత ఏడిపించింది? శూర్పణఖ అహంకారం వల్లనే గదా ఖర దూషణాదులు చచ్చింది! ఈ సీతాదేవి మాత్రం అడవిలో లక్ష్మణుణ్ణి పట్టుకుని ఎన్ని దుర్భాషలాడింది. అది అహంకారం కాదా? మరి ఆ మాటలకి రాముడికి కోపం రాదా? ప్రతి దానికీ పురుషాహంకారమంటూ ఏకపక్షంగా మాట్లాడకు. సరిగ్గా చూడు" అంది.

రావణ రాజనీతి తెలిసిన విభీషణుడు ఇలా అనుకోసాగాడు- "రాముడికి భార్యంటే చెప్పరాని ప్రేమ. అలాగే తన వంశ గౌరవమన్నా, తన ప్రజలన్నా చెప్పరాని ప్రేమ. ఆయన మహారాజైతే ఆవిడ మహారాణి. యువరాజు హోదాలో వున్న లక్ష్మణుణ్ణి అడవిలో అనేక కష్టాల మధ్య తమకి అండదండలుగా వున్న లక్ష్మణుణ్ణి వెనకా ముందూ ఆలోచించకుండా నానా మాటలూ అంది. అటువంటిది రేపు రాజధానిలో సర్వ సుఖాలనుభవిస్తూ అధికారుల్ని గాని, ప్రజలని గాని ఏమంటుందో?! ఆవిడ నిప్పుడే నిగ్రహించాల్సిన అవసరం రాముడికుంది-"


తార యొక్క రాజనీతి తెలిసిన సుగ్రీవుడిలా అనుకున్నాడు-

"-మారీచ సంహారానికి వెళ్ళిన రామచంద్రుడు సీతాదేవిని చూడడం ఇదే మొదలు. ఆనాడు ఆవిడ లక్ష్మణుడి దగ్గర నోరు సంబాళించుకోకపోవడం మూలంగా కదా ఈ బాధలన్నీ. ఆనాడు లక్ష్మణుడి మనస్సు ఎంత బాధ పడుంటుందో! ఇవాళ భార్యాభర్తలు ఒకరినొకరు అమాంతం కౌగిలించుకుంటే లక్ష్మణుని బాధపడ్డ ఆ మనస్సుకి ఉపశమనమేదీ? అదీకాక ఇదివరకు లక్ష్మణుడికి లేని ఒక ఊహ ఆవిడ కల్పించింది కదా. దీని ఆధారంగా ఈ వూహ రేపు లక్ష్మణునికి గాని, మరింకెవరికైనా గానీ కలిగితే దాని నివారణోపాయం కూడా ఆలోచించుకోవలసిన అవసరం రామచంద్రుడికుంది. ఏదైనా ప్రస్తుతం రామభద్రుడి స్థితి చాలా క్లిష్టమయింది-"

విశ్వామిత్ర బోధితమైన రాజనీతి విన్న లక్ష్మణుడు యిలా అనుకున్నాడు- "అన్నా! ఎందుకయ్యా, ఆ మహా సాధ్వి మీదా, నా మీదా నీ కింత కోపం? ఆ క్షణం, అది ఆ మారీచుమాయ. కాకపోతే ఆవిడ నోటి వెంట అంత మాట వస్తుందా? నేను ఆనాడే నా కంఠం కటారితో తెంచకపోయానా?"

సూర్య భగవాను ప్రియ శిష్యుడైన సుందర హనుమంతుడిలా అనుకున్నాడు: "నా దైవమా! రామచంద్రా! నీ వెంత శక్తిమంతుడవో ఆ మహాదేవి అంత శక్తిమతి!

## శ్రీరామనవమికి (మార్చి 26) ప్రత్యేకం



రావణుడు ఆమెను అపహరించడం ఒక దేవ రహస్యం! శచీపురందరాది ఋషి భావనా మహిమ! దైవ నిర్ణయం! లంకలో నా తోక కంటుకున్న నిప్పు చల్లగా వుందంటే అది ఆవిడ వలన! ఆ విషయం నీకూ తెలుసు. నీ రాజత్వానికీ, ఆవిడ వ్యక్తిత్వానికీ లంకె పెట్టిన ఈ సమస్యని ఆ మహాదేవి ఎలా ఎదుర్కొంటుందో చూడాల్సిందే-"

ఇంతలో సీతాదేవి లక్ష్మణుని వైపు తిరిగింది.

"నాయనా లక్ష్మణా! మీ అన్నకి నా మీద ఇంత కోపం ఎందుకో తెలుసునా? ఆనాడు నిన్ను అనరాని మాటలు అన్నానని... న్యాయమే! నాకీ శిక్ష పడ వలసిందే" అంది.

ఆ మాటలకు లక్ష్మణుడు కంపించి పోయాడు. "తల్లీ! ఆ తప్పు నీది కాదు, ఆనాడు పాదుకల కోసమొస్తున్న భరతుణ్ణి చూసి, యుద్ధానికి వస్తున్నాడని అనుమానించి నానా మాటలూ అన్న నాది. ఆ నా దోషం నీ మాటల వలన నేననుభవించిన బాధతో సమసిపోయింది" అన్నాడు.

"కాని నా దోషం మిగిలే వుందిగా. అది సమసి పోవాలి గదా! ఆ నాడింకా ఒక మాటన్నాను. రాముడు లేని నేను గోదావరిలో పడతాను, అగ్నిలో దూకుతాను, కాని జీవించను- అని. గుర్తుందా? నాయనా! నీ అన్న నన్నిప్పుడు త్యజిస్తున్నాడు. ఇక్కడ గోదావరి లేదు. నా మీద దయవుంచి చితి పేర్చు. అగ్ని ప్రవేశం చేస్తాను. బయటకు వస్తానో, రానో నాకు తెలియదు. కాని మీ అన్నకు తెలుసు. ఆయన మనకు చెప్పడు. ఆయన చక్రవర్తి కొడుకు! సార్వభౌముడు!! ఆయన శిక్షించే విధానమే వేరు! సప్త పర్వత సమానుడైన వాలిని ఒక్క బాణంతో కూల్చాడాయన. అంతటి మహా బలశాలికి చెట్టు చాటెందుకు? ఎందుకంటే- ఆ వాలి చేసిన నేరం అట్లాంటిది కనక. అటు సుగ్రీవుడి మీద రాజద్రోహ నేరం మోపి, ఇటు అతని భార్యని అపహరించాడు. అందుకని అటు సుగ్రీవుణ్ణి యుద్ధంలో చూపించి యిటు తను చాటు నుంచి బాణంతో కొట్టాడు. నాయనా! సర్వ నీతికోవిదా! ఆంజనేయా! వింటున్నావుగా. ఇంతవరకు నాకు బిడ్డలు లేరు. లక్ష్మణుడూ, నువ్వే బిడ్డలు. నువ్వు కట్టెలు పేర్చు. అతను అగ్ని పేరుస్తాడు. ఇవే నా చివరి ఘడియలేమో!"

"స్వామీ! రఘు కులమణి దీపమా! కౌసల్యాదేవి నా కోసం అడిగితే ఏం చెపుతావు?... రఘు వంశ జలధి ముత్యమైన భరతుడి కేం చెపుతావు? మహా రాజనీతి కోవిదుడవు- ఏమైనా చెప్పగలవు! కాని స్వామీ! ఒక్క మాట. నీ రాజనీతి పనిచేయని చోట్లున్నాయి. ఋష్యాశ్రమాలు!! అక్కడికి మాత్రం వెళ్లకు. ఒకవేళ వెళితే- నేను లేకుండా అరుంధతీ, అనసూయలకు మాత్రం కనిపించకు. ఆ మహా సాధ్వుల కోపాగ్ని నుంచి, కల్పాది యందు నువ్వు చేసిన తపస్సు కూడా నిన్ను రక్షించలేదు. జాగ్రత్త! నేను వెళ్ళొస్తాను. శలవు" అని సీతాంబర ధారిణి అయిన సీతా మహాదేవి అగ్నియందు కాలుంచింది. వజ్రమని ఒళ్లు కాలి ఒక్కడుగు వెనక్కి వేశాడు అగ్ని భట్టారకుడు.

జానకి మరొక్క అడుగు వేసింది. ఉన్నెత్తున లేచాడు నీతిహోత్రుడు.

మైథిలి మరొక్క అడుగు వేసింది. విల విలలాడాడు వైశ్వానరుడు.

భూమి సుత మరొక్క అడుగు వేసింది. కృశించి పోయాడు కృశానుడు.

ఊర్మిళా సోదరి మరొక అడుగు వేసింది. సప్త జిహ్వలు వెళ్లబెట్టాడు సప్తార్చి...

కౌసల్యాదేవి కోడలు మరొక అడుగు వేసింది. దహించుకుపోయాడు దహనుడు.

శ్రీరామ వైవాహిక మరొక అడుగు వేయబోయింది. మానుషాకృతి ధరించాడు చిత్రభానుడు.

"జగన్మాతా! నువ్వు స్వామితో కలసి నా చుట్టూ, ఏడడుగులు కాదు, ఏడు వందల అడుగులు వెయ్యి, భరిస్తాను. నువ్వొక్కత్తివే ఏడడుగులు కాదు గదా, ఒక్క అడుగు వేసినా నా అస్తిత్వమే కోలుపోతాను నేను. అటువంటిది ఆరడుగులు వేశావా తల్లీ!" అని, స్వామి దగ్గరకు వచ్చి "సీతాపతీ! నేను నట్టి యింధనాలకు సంబంధించిన అగ్నిని. ప్రళయాగ్నులైన మీరు నాలో ప్రవేశిస్తే నేనేమైపోతాను?! ఇదిగో, నీ భార్యను నువు తీసుకో! నా జోలికి మాత్రం రాకండి" అని అదృశ్యుడైనాడు శుచి.

సీతాదేవి శుచిత్వానికి, రామచంద్రుడి రాజత్వానికి సర్వదేవతా ఋషి సంఘాలునందన మాచరించాయి.

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే
రఘునాథాయ, నాథాయ, సీతాయాః పతయే నమః